తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT








సంపుటి: 1 సంచిక: 72 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ గురువారం 17 -10-2024 వెల: 5/రూ -




# మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## ఏడుగురు మృతి..

- వాగులో కారు పడ్డ కారు..
- శివ్వంపేట మండలం ఉసిరికపల్లి దగ్గర జరిగిన ప్రమాదం..
- డ్రైవర్ మినహా మిగిలినవారంతా మృతి ..
- సంతాపం తెలిపిన మాజీ మంత్రి హరీశ్ రావు

4లో

# ఐఏఎస్‌ల విభజన వివాదానికి తెర

### కేంద్రం కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లాలని స్పష్టం చేసిన హైకోర్టు

- డీవోపీటీ ఆదేశాల మేరకు తెలంగాణ నుంచి ఐదుగురు ఐఏఎస్ అధికారులు రిలీవ్
- వారి స్థానంలో ఇతర అధికారులకు ఇన్‌చార్జులుగా అదనపు బాధ్యతలు
- సందీప్‌కుమార్‌కు ఇంధనశాఖ, ట్రాన్స్‌కో, జెన్‌కోలు అప్పగింత
- జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తి.. శ్రీదేవికి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు
- ఏపీ నుంచి వచ్చి తెలంగాణలో రిపోర్టు చేసిన ముగ్గురు ఐఏఎస్ అధికారులు
- త్వరలో రాష్ట్రంలో ఐఏఎస్‌ల బదిలీలు జరిగే చాన్స్

2లో




హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య పదేళ్లుగా కొనసాగుతున్న ఐఏఎస్ అధికారుల విభజన వివాదానికి నాటకీయ పరిణామాల మధ్య తెరపడింది. కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్), హైకోర్టులో కేసులపై బుధవారం స్పష్టత వచ్చింది.



# పామాయిల్ సాగు చేయండి.. దర్జాగా బతకండి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలిస్తున్నాం: కోమటిరెడ్డి

నల్లగొండ: రైతులు పామాయిల్ సాగు చేస్తే.. మీసం మీద చేయి వేసుకుని దర్జాగా బతకొచ్చని వ్యవసాయ శాఖ మంత్రి, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం నల్లగొండలోని ఎస్ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్‌లో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. పామాయిల్ పంట తక్కువ నీటితో సాగవుతుందని చెప్పారు. తాను వంద ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నానని..

2లో

# గేమ్ చేంజర్లుగా కొత్త పాలసీలు

### ఇకపై థింక్ గ్లోబల్.. యాక్ట్ గ్లోబల్



- ప్రతి ఇంట్లోనూ ఒక వ్యాపారవేత్త
- అమరావతే ఏకైక రాజధాని
- ఆర్థిక రాజధానిగా విశాఖ
- కర్నూలులో హైకోర్టు బెంచ్
- ఇక ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులు
- రాజధానిలో టాటా ఇన్నోవేషన్ హబ్
- మీడియాకు వెల్లడించిన సీఎం చంద్రబాబు.

అమరావతి: రాష్ట్రంలోని ప్రతి కుటుంబం నుంచీ ఒక వ్యాపారవేత్త తయారయ్యేలా, ఐదేళ్లలో యువతకు ఇరవై లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఆరు పాలసీలను రూపొందించామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించిన ఆరు పాలసీలు గేమ్ చేంజర్లుగా నిలుస్తాయని వ్యాఖ్యానించారు.



# హరియాణా బీజేపీఎల్పీ నేతగా సైనీ

చండీగఢ్/ పంచకుల: హరియాణా బీజేపీ లెజిస్లేచర్ పార్టీ నాయకుడిగా నాయబ్‌సింగ్ సైనీ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు.

# పేదలకు రక్షణ కవచంగా బీఆర్ఎస్



రేవంత్‌రెడ్డి పంపే హైడ్రా బుల్డోజర్లకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అడ్డుగా నిలబడతారని, హైదరాబాద్ నగరంలో పేదలకు బీఆర్ఎస్ రక్షణ కవచంలా ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు. హైడ్రా, మూసీ ప్రాజెక్టు బాధితులకు భరోసా నింపేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశారు.

2లో

- రేవంత్‌రెడ్డి పంపే బుల్డోజర్లకు అడ్డుగా నిలబడతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో పార్టీ ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం
- మూసీ పరీవాహక ప్రాంతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బస్సుయాత్ర
- కూకట్‌పల్లి నుంచి హైడ్రా బాధితుల పరామర్శలు




# అరాచకానికి హద్దు లేదా?..

### నోటీసులపై సజ్జల రియాక్షన్

2లో

# ఐఏఎస్‌ల విభజన వివాదానికి తెర

(మొదటి పేజీ తరువాయి)



ఐఏఎస్ అధికారులు కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలన్న..'కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (డీవోపీటీ)' ఆదేశాలు అమల్లోకి వచ్చాయి. ఈ మేరకు తెలంగాణ నుంచి ఐదుగురు ఐఏఎస్‌లు ఏపీకి రిలీవ్‌కాగా.. ఏపీ నుంచి ముగ్గురు తెలంగాణలో రిపోర్టు చేశారు. ఇక ఐపీఎస్‌లకు సంబంధించిన కేడర్ ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. ఇరు రాష్ట్రాల మధ్య అఖిల భారత సర్వీసు (ఏఐఎస్) అధికారుల తుది కేటాయింపుల్లో భాగంగా 'కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (డీవోపీటీ)'.. తెలంగాణలో పనిచేస్తున్న ఐదుగురు ఐఏఎస్‌లను ఏపీ కేడర్‌కు కేటాయిస్తూ ఈ నెల 9న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై, క్యాట్ ఆదేశాలపై ఐఏఎస్‌లు హైకోర్టును ఆశ్రయించగా.. ఆ పిటిషన్లను కొట్టివేసింది. మరోవైపు బుధవారంలోపే ఏపీ ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని డీవోపీటీ ఆదేశాలు ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారులను వెంటనే రిలీవ్ చేసింది. రిలీవైన అధికారుల్లో ఇంధన శాఖ కార్యదర్శి/జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల ఇన్‌చార్జి సీఎండీ రోనాల్డ్ రోస్, జీహెచ్ఎంసీ కమిషనర్ కాట ఆమ్రపాలి, స్త్రీ/శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, యువజన, పర్యాటక, సాంస్కృతిక, క్రీడల శాఖ ముఖ్యకార్యదర్శి వాణి ప్రసాద్, ఆయుష్ డైరెక్టర్ మల్లెల ప్రశాంతి ఉన్నారు. ఇక రిలీవైన అధికారుల స్థానంలో ఇతర అధికారులకు ఇన్‌చార్జులుగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి.

**భారీగా ఐఏఎస్‌ల బదిలీలకు చాన్స్!**

మొత్తంగా ఐదుగురు ఐఏఎస్‌లు తెలంగాణ నుంచి వెళ్తుండగా.. ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు ఐఏఎస్‌లు ఇక్కడికి వస్తున్నారు. వచ్చిన వారికి పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉంటుంది. వెళ్లినవారి శాఖల్లో పూర్తిస్థాయిలో నియామకాలు చేపట్టాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రాష్ట్ర పాలన యంత్రాంగంలో మరోసారి భారీగా మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉన్నట్టు ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. మరోవైపు తెలంగాణలో ఉన్న డీజీ స్థాయి అధికారులు అంజనీకుమార్, అభిలాష్ భిష్త్‌లు కూడా డీవోపీటీ ఆదేశాల మేరకు ఏపీకి వెళ్లాల్సి ఉండనుంది. దీనిపై త్వరలోనే ఉత్తర్వులు రావొచ్చని అంటున్నారు.

**ప్రత్యూష్ సిన్హా సిఫార్సులే ఫైనల్**

రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యూష్ సిన్హా కమిటీ సిఫారసుల ఆధారంగా ఐఏఎస్ అధికారులు సోమేశ్‌కుమార్, కాటా ఆమ్రపాలి, జి.అనంతరాము, ఎం.ప్రశాంతి, వాకాటి కరుణ, ఎ.వాణిప్రసాద్, రోనాల్డ్ రోస్, ఎస్ఎస్ రావత్‌లను ఏపీ కేడర్‌కు.. హరికిరణ్, జి.సృజన, శివశంకర్ లహొటిలను తెలంగాణ కేడర్‌కు కేంద్రం కేటాయించింది. ఐపీఎస్ అధికారులు అంజనీకుమార్, అభిలాష్ బిష్త్, అభిషేక్ మహంతిలను ఏపీకి కేటాయించారు. అయితే ఈ అధికారులు క్యాట్‌ను ఆశ్రయించగా.. ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాలను కొట్టివేస్తూ 2017లో తీర్పు ఇచ్చింది. దానిపై కేంద్రం తెలంగాణ హైకోర్టులో అప్పీల్ చేయగా.. సోమేశ్‌కుమార్‌ను తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. సోమేశ్‌కుమార్ తక్షణమే ఏపీలో రిపోర్టు చేయాలంటూ 2023 జనవరి 10న తీర్పు ఇచ్చింది. అంతేగాకుండా ప్రత్యూష్ సిన్హా కమిటీ సిఫార్సులను హైకోర్టు సమర్థించింది. దీంతో సోమేశ్‌కుమార్ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పోస్టును కోల్పోవాల్సి వచ్చింది. ఈ తీర్పును ఇతర అధికారులకు కూడా వర్తింపజేయాలంటూ కేంద్రం దాఖలు చేసిన అప్పీళ్లపై విచారణ జరిపిన హైకోర్టు.. ఈ ఏడాది జనవరి 3న తీర్పునిచ్చింది. 10 మంది ఐఏఎస్‌లు, ముగ్గురు ఐపీఎస్‌ల కేటాయింపుపై క్యాట్ ఇచ్చిన తీర్పును పక్కనపెట్టింది. ఆ అధికారుల ప్రస్తుత, మిగిలిన సర్వీసు, వ్యక్తిగత అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని.. గతంలో జరిపిన తుది కేటాయింపులను పునఃసమీక్షించే బాధ్యతను డీవోపీటీకి అప్పగించింది. ఈ మేరకు డీవోపీటీ మాజీ సెక్రెటరీ దీపక్ ఖండేకర్‌తో ఏర్పాటైన ఏకసభ్య కమిటీ.. కేడర్ కేటాయింపుపై ఆయా అధికారుల విజ్ఞప్తులను తిరస్కరించింది. ఈ కమిటీ చేసిన సిఫార్సు ఆధారంగా.. ఐఏఎస్‌లు కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని డీవోపీటీ ఆదేశించింది.

# గేమ్ చేంజర్లుగా కొత్త పాలసీలు

(మొదటి పేజీ తరువాయి)

పారిశ్రామికవేత్తలకు మళ్లీ నమ్మకం కుదిరేందుకుగాను అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. అమరావతే ఏకైక రాజధానిగా ఉంటుందని పునరుద్ఘాటించారు. విశాఖ ఆర్థిక రాజధానిగా ఉంటుందని, కర్నూలుకు హైకోర్టు బెంచ్ వస్తుందని తెలిపారు. బుధవారం మంత్రివర్గ సమావేశం అనంతరం వెలగపూడి సచివాలయంలో మంత్రులు కొలుసు పార్థసారథి, కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్‌లతో కలసి చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. పెట్టుబడుల ఆకర్షణ.. ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఎలక్ట్రానిక్, ఇండస్ట్రియల్, క్లీన్ ఎనర్జీ, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ డెవల్‌పమెంట్, ఎంఎసఎంఈ పాలసీ, ప్లగ్ అండ్ ప్లే ఇండిస్ట్రియల్ పాలసీలను తీసుకువచ్చామని చంద్రబాబు చెప్పారు. ఇంకా ఆయన ఏమన్నారంటే....

**రతన్ టాటా ఇన్నోవేషన్ జోన్‌లు..**

"అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేస్తాం. ఈ హబ్ ద్వారా పారిశ్రామిక, వాణిజ్య వేత్తలకు అవసరమైన మేథో, సాంకేతిక పరిజ్ఞానాన్ని బదలాయించుకోవచ్చు. విశాఖ, తిరుపతి, రాజమండ్రి, గుంటూరు/కృష్ణా, అనంతపురంలో రతన్ టాటా ఇన్నోవేషన్ జోన్‌లను ఏర్పాటు చేస్తాం. నాలెడ్జ్ ఎకానమీకి ఇన్నోవేషన్ హబ్‌లు కేంద్రాలుగా ఉండాలి. రాష్ట్రంలో 2047 నాటికి 30 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించేలా పారిశ్రామిక విధానాన్ని అమలు చేస్తాం. వచ్చే నెల మొదటి వారంలో స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేస్తాం. ప్రపంచ దేశాల్లో మార్కెటింగ్ జరిగేలా రాష్ట్ర ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండ్ తీసుకువస్తాం. భావనపాడులో పదివేల ఎకరాల్లో ఇండిస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తాం. వచ్చే ఏడాది నాటికి భావనపాడు పోర్టును పూర్తి చేస్తాం. భోగాపురం విమానాశ్రయాన్ని త్వరలోనే అందుబాటులోకి తెస్తాం. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించి .. ప్రతి ఇంట్లోనూ ఒక పారిశ్రామికవేత్తను తయారు చేస్తాం"

**జాబ్ ఫస్ట్ నినాదంతో..**

"జాబ్ ఫస్ట్ నినాదంతో పారిశ్రామిక విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తాం. ఉద్యోగాల కల్పన ఆధారంగా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఉంటాయి. పారిశ్రామికవాడల్లోనూ..పరిశ్రమల ఏర్పాటులోనూ సామాజిక సమతుల్యతను పాటిస్తాం. మహిళలు, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీలను భాగస్వాములను చేస్తాం. రాష్ట్రంలో ఎంఎసఎంఈ ఇండస్ట్రీలన్నింటినీ పరిశీలించి..కాయిలా పడ్డవాటిని పునరుద్ధరిస్తాం. పరిశ్రమలను తీసుకువచ్చే బాధ్యత అధికారులదే. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తాం. రాష్ట్రమంతా గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చేస్తాం. నౌకాశ్రయాలను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లుగా మారుస్తాం. సోలార్, విండ్ , హైబ్రీడ్ సోలార్, పంప్డ్ స్టోరేజీ హైడల్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్ల అనుమతిలో 'ముందు వచ్చిన సంస్థలకు ముందుగా' పద్ధతిని అమలు చేస్తాం. ఎంఎసఎంఈలకు రూ.500 కోట్ల కార్పసఫండ్‌ను ఏర్పాటు చేస్తాం" అని చంద్రబాబు అన్నారు.

# పేదలకు రక్షణ కవచంగా బీఆర్ఎస్

ఈ మేరకు బుధవారం తెలంగాణ భవన్‌లో గ్రేటర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఇందులోభాగంగానే మూసీ పరీవాహక ప్రాంతాల్లో బీఆర్ఎస్ బస్సు యాత్ర చేపట్టనున్నది. కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి హైడ్రా బాధితుల పరామర్శలు మొదలుకానున్నాయి. హైదరాబాద్ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. అనాలోచిత నిర్ణయాలతో పేదలు, దిగువ మధ్య తరగతి ప్రజలు, సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. ఒక ప్రణాళిక, ఆలోచన లేకుండా ప్రభుత్వమే అలా అనుమతులు ఇచ్చి..ఇలా అక్రమమంటూ హైడ్రా పేరిట హైడ్రామాలు చేస్తూ వందలాది కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్నది. మూసీ, హైడ్రా ప్రాజెక్టు విషయంలో ఒక భయానక వాతావరణాన్ని సృష్టిస్తు న్నారు. ప్రభుత్వ విధానాలను ఎక్కడికక్కడ ఎండగడుతూ ప్రజలకు భరోసా ఇచ్చేందుకు బీఆర్ఎస్ సమరశంఖం పూరించింది. ఈ వారంలో మూసీ పరీవాహక ప్రాంతంలో కేటీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల బృందంతో బస్సు యాత్ర చేపట్టనున్నారు. ఈ భరోసా యాత్రలో నోటీసులు అంటించిన ఇండ్లలో కలియతిరిగి వారిలో ధైర్యాన్ని నింపనున్నారు. మూసీ పేరిట ప్రభుత్వం ఏ విధంగా లూటీ చేస్తుందో? అమాయక ప్రజల జీవితాలతో ఎలా చెలగాటం ఆడుతుందో వివరించనున్నారు. మూసీ సుందరీకరణకు లక్షన్నర కోట్లను ఖర్చు చేయాల్సిన అవసరం ఎందుకు వస్తుందో ప్రశ్నించనున్నారు. గరీబోళ్లకు అన్యాయం జరుగుతుందంటే ఆ ప్రాజెక్టు వద్దని కేసీఆర్ ప్రభుత్వం మానవీయ ముఖ్యమంత్రిగా నిర్ణయాలు తీసుకున్నారని, ఒక్క పేదవాడి కడుపు కొట్టకుండా సుందరీకరణ చేపట్టిన సంగతిని ప్రజలకు వివరించనున్నారు. తొలుత కూకట్‌పల్లి నియోజకవర్గంలో కేటీఆర్‌తో కూడిన ఎమ్మెల్యేల బృందం పర్యటించి హైడ్రా బాధితులను పరామర్శించనున్నది.




# పామాయిల్ సాగు చేయండి.. దర్జాగా బతకండి

(మొదటి పేజీ తరువాయి)

మీరు మంత్రి కోమటిరెడ్డిని వెంటబెట్టుకుని వచ్చి చూడవచ్చని రైతులకు సూచించారు. నల్లగొండ జిల్లాలో 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తే.. ఇక్కడే పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశామని.. మిగిలిన రుణమాఫీని కూడా చేయా లని కేబినెట్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. గత ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం ఎటు పోయిందో.. ఎవరు తిన్నారో కూడా తెలియదని.. రూ.50 వేల కోట్ల అప్పులయితే ఉన్నాయని చెప్పా రు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసినవారే ఇప్పుడు శ్రీరంగ నీతులు చెబుతున్నారని విమర్శించారు. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నా మని.. ఆ ధాన్యం కొనుగోలు చేసి రేషన్ కార్డు దారులకు, హాస్టళ్లకు బియ్యం సరఫరా చేస్తామ న్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మళ్లీ మంత్రిగా రావడంతోనే సొరంగ మార్గం పనులు మొద లయ్యాయని, ఆయన హయాంలోనే సొరంగ మార్గం పూర్తవుతుందని పేర్కొన్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు వేతనాలు కూడా ఇవ్వలేకపోయిందని.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 1వ తేదీనే జీతాలు ఇస్తున్నామని చెప్పారు.

# కార్బన్ క్లీనింగ్ సెంటర్ ప్రారంభించిన గోపులరం మాజీ సర్పంచ్ పొడవు శ్రీ నివాస్




(మొదటి పేజీ తరువాయి)

**శంకర్పల్లి అక్టోబర్ 16: (డైలీ రిపోర్ట్):** శంకర్పల్లి మండలం దొంతనపల్లి గేటు వద్ద శ్రీ జగన్నాథ కార్బన్ క్లీనింగ్ సెంటర్ ని ప్రారంభించిన మాజీ సర్పంచ్ పొడవు శ్రీనివాస్ మరియు దొంతనపల్లి మాజీ సర్పంచ్ సుధాకర్. కుమ్మరి శ్రీకాంత్ మరియు చాకలి సాయిని వారు ప్రత్యేకంగా అభినందించారు ఇలాంటి షోరూములు మరెన్నో ఓపెన్ చేసి యువత స్వయం ఉపాధితో ఎదగాలని వారు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బయన్న, వెంకటరామిరెడ్డి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# హరియాణా బీజేపీఎల్పీ నేతగా సైనీ

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం పంచకులలో సమావేశమైన బీజేపీ ఎమ్మెల్యేలు సైనీని తమ నాయకుడిగా ఎన్ను కున్నారు. సైనీ పేరును ఎమ్మెల్యే క్రిషన్ కుమార్ బేడీ ప్రతిపాదించగా.. సీనియ ర్ నేత అనిల్ విజ్ బలపరిచారు. అనిల్ విజ్ సైతం సీఎం పదవిని ఆశించినప్పటికీ బీజేపీ అగ్రనేతలు సైనీ వైపు మొగ్గారు. పరిశీలకుడిగా హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. సైనీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం సైనీ గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఈనెల 5న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 48 స్థానాలు నెగ్గి హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. అధికారంలోకి రావడం ఖాయమని సర్వేలన్నీ అంచనా వేసిన కాంగ్రెస్ 37 స్థానాల వద్దే నిలిచిపోయింది. హరియాణా ముఖ్యమంత్రి రెండోసారి సైనీ గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మోదీ, రాజ్‌నాథ్ సింగ్‌లతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఎన్డీయే సీఎంలు హాజరుకానున్నారు.

# అరాచకానికి హద్దు లేదా?..

(మొదటి పేజీ తరువాయి)

తాడేపల్లి: చంద్రబాబు సర్కార్ కక్ష సాధింపు చర్యలపై వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. విచారణకు హాజరు కావాలంటూ మంగళగిరి పోలీసులు ఇచ్చిన నోటీసులపై ఆయన స్పందించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, అబద్ధాన్ని అయినా చంద్రబాబు నిజంగా మల్చుతారని.. పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేశారంటూ ధ్వజమెత్తారు. "మాకు న్యాయ స్థానాలపై విశ్వాసం ఉంది. నేను విదేశానికి వెళ్లానని తెలిసి లుకౌట్ నోటీసు ఇచ్చారు. అక్టోబర్ 7న విదేశానికి వెళ్తే 10న నోటీసు ఇచ్చారు. 2021లో టీడీపీ ఆఫీస్‌పై దాడి జరిగితే ఇప్పుడు మళ్లీ కొత్తగా మాకు నోటీసులు పంపుతున్నారు. కేసు ముగిసే సమయానికి నోటీసులు ఏంటి?. ఏపీలో అసలు ప్రభుత్వం ఉందా? అరాచకానికి హద్దు లేదా?" అంటూ సజ్జల నిప్పులు చెరిగారు."అధికారం ఉందని తప్పుడు కేసులు పెడుతున్నారు. దానిపై మేము న్యాయం కోర్టుకు వెళ్తాం. ఎల్లోమీడియా తప్పుడు వార్తలు రాస్తోంది. మీ పెండ్యాల శ్రీనివాసరావు, ఇతర నేతల్లాగా నేనేమీ పారిపోవడం లేదు. కానీ లుకౌట్ నోటీసులు పేరుతో హడావుడి చేస్తున్నారు. ఎప్పుడో మూడేళ్ల క్రితం జరిగిన టీడీపీ ఆఫీసు మీద దాడి కేసును ఇప్పుడు బయటకు తీశారు. అసలు ఆ దాడి జరగడానికి కారణం ఏంటో కూడా అందరికీ తెలుసు..టీడీపీ నేతలు సీఎం జగన్ ని దారుణంగా దూషించారు. సుప్రీంకోర్టు నాకు ఇంటీరియమ్ ప్రొడక్ట్ ఇచ్చింది. అది కూడా సెప్టెంబర్ 20నే ఇచ్చినా కూడా ఇప్పుడు నాకు నోటీసులు ఎలా ఇస్తారు?. చేతిలో అధికారం ఉందని ఎలాగైనా నోటీసులు ఇస్తారా?. దీన్ని బరితెగింపు అనాలా? పొగరు అనాలా? ఇంకేమైనా అనాలా?. అసలు రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తోందా?. ఏమాత్రం బేస్‌లేని విషయాలలో కూడా నోటీసులు ఇచ్చి ఏం చేయాలనుకుంటున్నారు?. స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఈడీ అటాచ్‌మెంట్ చేసిందంటే చంద్రబాబు తప్పుడు పని చేసినట్టు నిర్ధారణ అయింది. అందుకే ఆస్తుల అటాచ్‌మెంట్ జరిగింది. కానీ చంద్రబాబుకు క్లీన్ చిట్ అని ఎలా రాస్తారు? అంతకన్నా బరితెగింపు ఉంటుందా?" అంటూ సజ్జల రామకృష్ణారెడ్డి నిలదీశారు."అలా తప్పుడు ప్రచారం చేసి జనాన్ని నమ్మించగలరేమోగానీ కోర్టును నమ్మించలేరు. జత్వానీ కేసులో కూడా నన్ను ఇలాగే ఇరికించారు. ఏదోలాగా కేసుల్లో ఇరికించి ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారు. పట్టాభి ఉద్దేశపూర్వకంగా వైఎస్ జగన్‌ని దూషించారు. అప్పుడు టీడీపీ ఆఫీస్‌పై గొడవ జరిగింది. వైఎస్ జగన్ మీద కూడా తప్పుడు కేసులు పెట్టాలని చూస్తున్నారు. ఎలాంటి నేరం జరగకపోయినా జరిగినట్టుగా క్రియేట్ చేసి కేసులు పెడుతున్నారు. బోట్లతో ప్రకాశం బ్యారేజిని కూల్చాలని ప్లాన్ చేశారని కూడా కేసులు పెట్టారు. అలాంటి వారికి న్యాయంతో పనిలేదు. ఏదోలా కేసులలో ఇరికించాలనే లక్ష్యంగా పని చేస్తున్నారు. పార్టీలో యాక్టివ్‌గా ఉన్న వారందరినీ టార్గెట్ చేసి భయపెట్టాలని చూస్తున్నారు. కోర్టుల్లో న్యాయ పోరాటం చేస్తాం" అని సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు



# కిడ్నీ వ్యాధి గ్రస్థులకి శుభవార్త !

## సిద్దిపేట డయాలసిస్ సెంటర్ కు మరో 5 పడకలు మంజూరు..

## ఇప్పటికే 10 పడకలతో సిద్దిపేట లో డయాలసిస్ సేవలు...

## మొత్తం 15 పడకలతో అందుబాటులో కి రానున్న డయాలసిస్ సేవలు ..

## వ్యయ ప్రయాసల నుండి ఉపశమనం ..

## కిడ్నీ వ్యాధి గ్రస్థులు సద్వినియోగం చేసుకోవాలి ..ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్దిపేట , (డైలీ రిపోర్ట్) , అక్టోబర్ 16 :** సిద్దిపేట లోని కిడ్నీ వ్యాధి గ్రస్థులకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు గారు శుభవార్త చెప్పారు. మరో 5 పడకలు సిద్దిపేట డయాలసిస్ సెంటర్ లో అందుబాటులో కి రానున్నట్లు హరీష్ రావు తెలిపారు.. ఈ సందర్బంగా మాట్లాడుతూ సిద్దిపేట ప్రాంతం లోని కిడ్నీ వ్యాధి గ్రస్తుల వ్యయప్రయాసలు దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్ తరవాత సిద్దిపేట లోనే తొలి డయాలసిస్ సెంటర్ ను మంజూరు చేసుకున్నామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రం లో నగరాలకు పరిమితం అయిన ఈ డయాలసిస్ సెంటర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడినక తొలి డయాలసిస్ సెంటర్ 5 పడకలతో సిద్దిపేట లో ఏర్పాటు చేసుకున్నాం తరవాత రాష్ట్రం లోని అన్ని నియోజకవర్గాల్లో డయాలసిస్ సేవలు అందుబాటులో కి తెచ్చామన్నారు... కిడ్నీ వ్యాధి తో బాధపడుతున్న రోగులు హైద్రబాద్ వెళ్లే పరిస్థితి.. కానీ ఆ బాధను గుర్తించి సిద్దిపేట లోనే సెంటర్ ని ఏర్పాటు చేశామని .ఇలాంటి వ్యాధి తో బాధపడుతున్న వారు ఎంతో మంది. లక్షలు ఖర్చు పెట్టినా నయం కాని వ్యాధి , ఉచితంగా నయం అయ్యే విధంగా ఇది సిద్దిపేట ప్రజలకు ఒక వరమని చెప్పారు . మొదట 5 పడకలతో మొదలైన డయాలసిస్ సెంటర్ ప్రజల అవసరల దృష్ట్యా మరో 5 పడకలు మంజురు కాగా కొత్తగా హరీష్ రావు గారికి మరిన్ని విజ్ఞప్తుల మేరకు మరో కొత్తగా 5 పడకలు మంజురు అయ్యాయి. త్వరలోనే సిద్దిపేట డయాలసిస్ సెంటర్ లో అందుబాటులోకి రానున్నాయి. కిడ్నీ వ్యాధి గ్రస్తులకు వరం గా మారనుంది.

### 78వేల 800 కేసులు .. తగ్గిన లక్షల ఖర్చు లు, వ్యయప్రయసలు ..

సిద్దిపేట నియోజకవర్గం లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు గారి ప్రత్యేక చొరవ తో రాష్ట్రం లోనే తొలి డయాలసిస్ సెంటర్ 2017 లో మొదట 5 పడకలతో ప్రారంభం అయింది.. హరీష్ రావు గారికి వచ్చిన అనేక విజ్ఞప్తుల దృష్ట్యా 2019 లో మరో 5 పడకలు మంజూరు చేశారు.. ప్రస్తుతం వందల మంది డయాలసిస్ సేవలు



అందుబాటులో వస్తున్న తరుణం లో గడిచిన ఈ ఏడు సంవత్సరాలలో 78 వేల కేసులు అంటే వ్యాధి గ్రస్థులు రెండు మార్లు మూడు మార్లు చేసుకుకొనే అవకాశం ఈ డయాలసిస్ సెంటర్ లో బాధితులకు చికిత్స అందింది.. ప్రస్తుత తరుణం లో కిడ్నీ వ్యాధి గ్రస్థులు పెరిగారు, మరో వైపు హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి చేపించుకొనే ఆర్థిక పరిస్థితి లేకేపోవడం ఎన్నో వ్యయ ప్రయాసలు లోను కావడం తో ప్రజల నుండి అనేక విజ్ఞప్తులు హరీష్ రావు గారి ద్రుష్టి కి రాగ మరో 5 పడకలు కొత్తగా మంజూరు అయ్యాయి.. దీనితో సిద్దిపేట డయాలసిస్ సెంటర్ లో మొత్తం 15పడకల తో డయాలసిస్ సెంటర్ అందుబాటులో కి రానుంది ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు..



# రైతులు తమ పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలి

## పశువైద్యాధికారి డాక్టర్ శ్రావణి...

**శంకర్ పల్లి: అక్టోబర్ 16(డైలీ రిపోర్ట్):** రైతులు తమ పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని శంకర్ పల్లి మండలం మహారాజ్ పేట్ పశువైద్యాధికారి డాక్టర్ శ్రావణి అన్నారు. బుధవారం మండలంలోని మహారాజ్ పేట్, జనవాడ గ్రామాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మందులను రైతులు తమ పశువులకు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జె బి ఓ శ్వేతా రాథోడ్, ఎల్ ఎస్ ఏ ఆనంద్ కుమార్ రైతులు పాల్గొన్నారు.

# శంకర్ పల్లి మున్సిపాలిటీలో వర్షం పడితే రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి





**శంకర్ పల్లి: అక్టోబర్ 16 :(డైలీ రిపోర్ట్):** శంకర్ర్ పల్లి మున్సిపాలిటీలో గల రిత్విక్ వెంచర్ కాలనీ, అయ్యప్ప రెడ్డి గూడెం కాలనీ, హనుమాన్ నగర్ కాలనీ, ఎస్ఎంఎస్ కాలనీ, ఇవే కాకుండా మున్సిపాలిటీలో గల అనేక కాలనీలలో చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయని ఆయా కాలనీ ప్రజలు తెలిపారు. అదేవిధంగా కాలినీలలో ఉన్నటువంటి ప్రధాన రోడ్లు అధికారులు బాగు చేస్తున్న కాలనీలలో, ఉన్నటువంటి అంతర్గత రోడ్లను పట్టించుకునే నాధుడు లేదని ఆయా కాలనీ ప్రజలు తెలిపారు. అదేవిధంగా భవాని నగర్, సింగపురం మెయిన్ రోడ్డు, లలో చాలా బాగా రోడ్డు వేయిస్తున్నారని కానీ శంకరపల్లి మున్సిపాలిటీలో ఇతర కాలనీలలో రోడ్లకు ఎందుకు వేయించడం లేదని ప్రజలు తెలిపారు. మా యొక్క కాలనీలు శంకర్ పల్లి మున్సిపాలిటీలో భాగం కావా అనివాళ్లు విచారం వ్యక్తం చేశారు.వర్షం పడితే శంకర్ పల్లి మున్సిపాలిటీలో గల కొన్ని కాలనీలలో ఇళ్ళ ముందు నీరు చెరువులను తలపిస్తున్నాయని, మున్సిపాలిటీ ఏర్పడ్డాక కూడా మాకు ఈ బాధలు ఏంటని వాళ్లు తెలిపారు. ఇకనైనా శంకర్ పల్లి మున్సిపాలిటీలో ఉన్నటువంటి కాలనీలలో వివక్ష బేధం చుపకుండా అన్ని కాలనీలలో రోడ్లు వేయించవలసిందిగా మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్ పర్సన్ వారికి, శంకర్ పల్లి మున్సిపల్ ప్రజలు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఈ రోడ్ల సమస్య గురించి మున్సిపల్ కమిషనర్ గారికి వివరణ కోసం రెండు రోజుల నుండి ఫోన్ చేస్తే సమాధానం ఇవ్వకుండా ఫోను ఎత్తడం లేదని పత్రిక ప్రతినిధి తెలిపారు.

# ముస్తాబైతున్న దండారి ఉత్సవాలు...!





**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:-** ఆదివాసీల పెద్ద పండగ దండారి. గిరిజనుల తీరుప్రత్యేకం. వారి ఆచార వ్యవహారాలు సంస్కృతి సంప్రదాయాలు భిన్నంగాఉంటాయి. గోండు గూడాల్లో గిరిజనుల జీవనశైలిని ప్రతిబింబించేదండారి గుస్సాడి ఉత్సవాలు నేడు ప్రారంభంకానున్నాయి. విచిత్రవేశాధారణతో అంతే అద్భుతమైన పద్ధతులతో వారు చేసే పూజలు,ఏర్పాట్లు వారి సంప్రదాయాలను పరిచయం చేస్తాయి. దీపావళికి పక్షంరోజుల ముందు ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక దండారిమొదలవుతుంది.

### బలిదానంతో దండారి మొదలు..

ఆదివాసీలు గ్రామ కూడలిలో నెమలి ఈకలతో ప్రత్యేకంగా తయారుచేసిన టోపీలు, జంతు చర్మంతో తయారు చేసిన డప్పులు, డోలు,గుమేల, ఫరా లాంటి వాయిద్యాలతో పాటు గజ్జెలు, కోలాలు,మంత్రదండం లాంటి రోకలి తదితర సంప్రదాయ వస్తువులను గ్రామపటేల్ ఇంటి ముందు ఉంచి వాటికి బలిదానం చేసి ప్రత్యేక పూజలతోభోగి పండగ చేసి ఉత్సవాలు ఆరంభిస్తారు. గిరిజన గోండు గూడాల్లోగ్రామ పటేల్కి ప్రత్యేకమైన స్థానం. ఆయన ఊరి పెద్దగా వ్యవహరిస్తూఉంటారు. గిరిజనులకు పటేల్ మాట వేదవాక్కు. అందుకే దండారిఉత్సవాలు గ్రామ పటేల్ ఇంటి ముందే నిర్వహించడం ఆనవాయితీ.

### ప్రత్యేక వేషధారణలు..

దండారి ఉత్సవాలలో భాగంగా తొమ్మిది రోజుల పాటు గుస్సాడివేషాధారణ వేసిన వారు దండారి ముగింపు వరకు స్నానం చేయరు.ఒంటికి బూడిద పూసుకొని దాన్నే స్నానంగా భావించడం వీరి ఆచారం.దీనితో పాటు ముఖానికి మసి, ఎడమ భుజంపై జింక తోలు, మెడలోరుద్రాక్షలు, కుడి చేతిలో మంత్రదండం(రోకలి), జంతువుల కొమ్ములు,నెమలి ఈకలతో చేసిన టోపీలు, కాళ్లకు గజ్జలు, నడుముకు వారివస్తువుల సంచితో, విచిత్ర వేశధారణతో సంప్రదాయానికి ప్రతీకగానిలుస్తారు.

### ఇతర గ్రామాల గుస్సాడీలకు ఆతిథ్యం..

గుస్సాడి వేశధారణ వేసినవారు ఒక సంవత్సరం తమ సొంత గ్రామంనుంచి మరో గ్రామానికి వెళ్లి అక్కడి గిరిజనుల ఆథిత్య విందులో పాల్గొనిఆటపాటలతో, నృత్యాలతో కనువిందు చేయడం ఆనవాయితీ. దీంతోఇతర గ్రామాలకు వెళ్లిన గుస్సాడీలకు ఘన స్వాగతం పలుకుతారు.మొదట అథిత్యం పుచ్చుకున్న వీరు తర్వాతి సంవత్సరం తమగ్రామానికి ఆహ్వానిస్తారు. ఇలా ఆ గ్రామాల మధ్య బంధుత్వంపెరుగుతుంది.

### గుస్సాడీ వేషాలు.. థింసా నృత్యాలు

గిరిజనులు గుస్సాడీ వేషాన్ని ధరించేందుకు ఆసక్తి చూపుతారు. గుస్సాడీవేషాధారణ వేసిన వారికి వారి దేవతలు ఆవహిస్తారని చెబుతారు.అతని చేతికి ఉన్న మంత్రదండం శరీరాన్ని తాకితే ఎలాంటి రోగాలైననయమవుతాయని వారి నమ్మకం. డప్పులు, భాజాలతో చప్పుళ్లకుఅనుగుణంగా గజ్జెల అడుగులతో లయబద్ధంగా నాట్యం చేస్తూ గుస్సాడీనృత్యాలు ప్రదర్శిస్తారు. గోండు గిరిజన మహిళలు కూడా పురుషులతోసమానంగా థింసా నృత్యాలు చేస్తారు.

### నువ్వుల నూనెతో పూజలు..

గిరిజన గ్రామాల్లో ప్రతి ఇంటిలో దీపావళి పండగ సందర్భంగా గిరిజనమహిళలు పవిత్రంగా ఉపావాస దీక్ష చేస్తూ నువ్వులను రోటిలో దంచినూనెను తీస్తారు. ఆ నూనెతో దండారి ముగింపు వరకు దీపాలనువెలిగించి పూజలు చేస్తారు. నెమలి టోపీల తయారీకి కేరాఫ్ పాటగూడ..నెమలి పింఛం టోపీల తయారీలో కెరమెరి మండలంలోని పాటగూడగ్రామం ప్రసిద్ధి గాంచింది. గడిచిన పాతికేళ్ల నుంచి ఈ గ్రామస్తులు నెమలిటోపీలను తయారు చేస్తున్నారు. అదిలాబాద్ జిల్లాలోని బోథ్ నియోజకవర్గంలో ఇచ్చోడ ,బోథ్, బజార్ హత్నూర్, నేరడిగొండ, సిరికొండ, గుడిహత్నూర్, తదితరగ్రామాలకు చెందిన వారు ఇక్కడి నుంచి నెమలి పింఛం టోపీలనుకొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. ఒక్క టోపీ ఖరీదు రూ. 10 వేలుపలుకుతున్నా.. వీరు కేవలం రూ. 3 వేలు కూలీ కిందతీసుకుంటున్నారు.

### కొలబొడితో దండారి ముగింపు...

దీపావళి పండగ మరుసటి రోజు కొలబోడి ఉత్సవాలనుదండారిసంబరాలు ముగిస్తారు. దీపావళి అనంతరం గుస్సాడీలు చివరి రోజునఆనందంగా నృత్యాలు చేస్తారు. అనంతరం గ్రామ పొలిమేరల్లో ఉన్నఇప్ప చెట్టు వద్ద తమ ఇలవేల్పు అయిన భీందేవుని సన్నిధికిచేరుకుంటారు. అక్కడ కొలబోడి సందర్భంగా నెమలి టోపీలనుతొలగిస్తారు. గుస్సాడీ వేశధారణ, అలంకారణ వస్తువులను భీందేవునిసన్నిధిలో పెట్టి కోళ్లు, మేకలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

### పవిత్రమైన పండగ..

మా ఆదివాసీ గోండు గిరిజనులకు దీపావళి పండగా పవిత్రమైన పండగ.అత్యంత పవిత్రంగా గిరిజన దేవతలను, వన దేవతలను పూజిస్తాము.ఈ పండగకు బంధువుల ఇళ్లకు వెళ్తాం. గ్రామంలో ప్రతి రోజు రాత్రిగుస్సాడీలు థింసా నృత్యాలు, రేలారేరేలా ఆడపడుచుల నృత్యాలుఆకట్టుకుంటాయి.

# మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## ఏడుగురు మృతి..

వాగులో కారు పడ్డ కారు ..

శివ్వంపేట మండలం ఉసిరికపల్లి దగ్గర జరిగిన ప్రమాదం..

డ్రైవర్ మినహా మిగిలినవారంతా మృతి ..

సతాపం తెలిపిన మాజీ మంత్రి హరీశ్ రావు







**మెదక్ , (డైలీ రిపోర్ట్) , అక్టోబర్ 16 :** మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శివ్వంపేట మ మండలం ఉసిరికపల్లి శివారులో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న వాగులో బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న ఏడుగురు వ్యక్తులు మృతి చెందారు. శివ్వంపేట మండలం తాళ్లపల్లి తండాకు చెందిన శివరాం, దుర్గి దంపతుల మూడో కూతురు ప్రమీల సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సీతారాంపల్లి తండాలో ఉంటుంది. మంగళవారం ఆమె ఇంట్లో దావత్ జరిగింది. ఆ దావత్ కు వెళ్లేందుకోసం శివరాం, దుర్గి దంపతులు మంగళవారం బీమ్లా తండాలో ఉండే పెద్ద కూతురు శాంతి ఇంటికి వచ్చారు. ఇదే మండల పరిధిలో ఉండే రెండో కూతురు, మనుమరాళ్లను కూడా అక్కడికే పిలిపించారు. వారు వచ్చాక శివరాం, దుర్గి, వారి పెద్ద కూతురు శాంతి. అల్లుడు నాంసింగ్, వారి కూతురు మమత, రెండో కూతురు అనిత, ఆమె ఇద్దరు కూతుళ్లు ఇందు, శ్రావణి... మొత్తం ఎనమిది మంది కలిసి పెద్ద అల్లుడు నాంసింగ్ కు చెందిన స్విఫ్ట్ కారులో మంగళవారం సాయంత్రం బయలు దేరి సీతారాంపల్లికి వెళ్లారు. రాత్రి అక్కడ జరిగిన దావత్ లో పాల్గొన్నారు. బుధవారం మధ్యాహ్నం భోజనాలు చేసి ఇళ్లకు తిరుగుప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో తూప్రాన్ మీదుగా వచ్చి ఉసిరికపల్లి క్రాస్ రోడ్డు వద్ద నుంచి బీమ్లా తండా రోడ్డుకు మరలారు. ఒక కిలోమీటరు దూరం వెళ్లగానే ఉసిరికపల్లి శివారులో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న దొంతి వాగులో బోల్తా పడింది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వాగులోని గుంతలో నీరు నిలవగా కారు అందులోనే పడటంతో అందులో ఉన్న ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నలుగురు పెద్దవారు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. గుంతలో పడిన కారును జేసీబీ సాయంతో బయటకు తీశారు. కారు వాగులో బోల్తా పడటంతో అందులో ఉన్న తాళ్లపల్లి తండాచెందిన శివరాం ( 61), ఆయన భార్య దుర్గి (45), వారి పెద్ద కూతురు బీమ్లా తండాకు చెందిన శాంతి (40), ఆమె కూతురు మమత ( 12), రెండో కూతురు జగ్యా తండాకు చెందిన అనిత (35), ఆమె కూతుళ్లు ఇందు (9), శ్రావణి (7) మృతి చెందారు. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న నాంసింగ్ ఒక్కడే గాయాలతో బయటపడ్డాడు. నాంసింగ్ రెండు కాళ్లు విరగగా చికిత్స కోసం నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. తూప్రాన్ డీఎస్పీ వెకంట్ రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించారు. శివ్వంపేట పోలీసులు కేసు నమోదు చేయగా, మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉసిరికపల్లి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం... మెదక్ జిల్లా శివంపేట మండలం ఉసిరికపల్లి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో పాముబండ తండాకు చెందిన ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గాయపడిన వారికి తక్షణం వైద్యం అందించాలన్నారు.మృతుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్ గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# గ్రామాలలో పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలి: జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఐపిఎస్

ఆర్థిక నేరాలను కట్టడి చేయడానికి రాత్రి సమయంలో అదనంగా పెట్రోలింగ్ వాహనాలతో గస్తీ నిర్వహించాలి.

సిసిటీవీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సహించాలి.

ఆదిలాబాద్ డిఎస్పి కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.



**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదిలాబాద్ డిఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఐపిఎస్. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీకి సాయుధ బలగాలతో కూడిన బృందం గౌరవ వందనాలు అందించి, ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు సునీల్, కరుణాకర్ పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించారు. కార్యాలయ పరిసరాలను చుట్టూ తిరిగి పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆదిలాబాద్ పట్టణంలో ఉన్న పోలీస్ పోలీస్ స్టేషన్లో వచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదు దారు పిటిషన్ వెంటనే నమోదు చేసి సంబంధిత అధికారులకు అప్పగించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించినప్పుడే ప్రజలలో పోలీసుల పట్ల నమ్మకం పెరుగుతుందని తెలిపారు. గ్రామాలలో పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలను పెంచుకోవాలని, సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా ప్రజలను ప్రోత్సహించారని తెలియజేశారు. రాత్రి సమయాలలో అదనంగా గస్తీ నిర్వహిస్తూ ఆర్థిక నేరాలను కట్టడి చేసే విధంగా ప్రణాళికను రూపొందించి అవలంబించాలని సూచించారు. సిబ్బంది ఎల్లవేళలా పోలీస్ స్టేషన్లో అప్రమత్తంగా ఉండి ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు లేకుండా అందుబాటులో ఉండాలన్నారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి ఎటువంటి పెండెన్సీ లేకుండా చూడాలని తెలిపారు. 5 %ా% విధానాన్ని అమలు చేస్తూ రికార్డుల నిర్వహణను చేపట్టాలని సూచించారు. సిబ్బంది విధులను పర్యవేక్షిస్తూ ఎలాంటి లోపాలను లేకుండా సరిచూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, సిఐలు కరుణాకర్, సునీల్, శ్రీనివాస్, నవీన్ డీఎస్పీ కార్యాలయ సిబ్బంది జైపాల్, రవి, కిష్టయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి డాక్టర్ సీతక్కకు కృతజ్ఞతలు తెలిపిన చల్లా నారాయణరెడ్డి

### ఆయిల్ ఫామ్ మొక్కలను సద్విని చేసుకోగలరు



కొత్తగూడ గంగారం ,అక్టోబర్ 16(డైలీ రిపోర్ట్): ములుగు అసెంబ్లీ మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ & గంగారం ఉమ్మడి మండలాల ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన నేతరులకు సబ్సిడీపై ఆయిల్ఫామ్ మొక్కలు డ్రిప్ అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయం తీసుకుంది భూమికి పట్టాలు లేకున్నా కూడా సాగులో ఉన్నటువంటి భూములకు ఆయిల్ ఫామ్ పెట్టుకునే గిరిజన నేతరులకు రైతులకు అవకాశం కల్పించినందుకు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ %డ% గ్రామీణ అభివృద్ధి శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క వారికి ప్రత్యేకంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చల్లా నారాయణరెడ్డి ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్విని చేసుకోగలరని కోరారు.

# పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్.

రెండవ సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న శిక్షణ కానిస్టేబుళ్లు.

నలుగు రోజులపాటు జరగనున్న పరీక్షలు.

పరీక్షలు రాస్తున్న 254 మంది శిక్షణ కానిస్టేబుళ్ళు

నిజామాబాద్ నుండి విచ్చేసిన పరీక్షల నిర్వాహకులు.




**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా శిక్షణ కేంద్రం నందు శిక్షణ తీసుకుంటున్న కానిస్టేబుల్ లకు రెండవ సెమిస్టర్ చివరి పరీక్షలు ఉన్నందున జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్ ఈరోజు ఉదయం పరీక్షా కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. 9 నెలల పాటు శిక్షణను తీసుకొని చివరి రాత పరీక్షలను రాస్తున్న 254 మంది శిక్షణ కానిస్టేబుళ్ళు. నాలుగు రోజులపాటు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రతి ఒక్కరు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణులు కావాలని జిల్లా ఎస్పీ కోరుకున్నరు. నిజామాబాద్ నుండి విచ్చేసిన ప్రత్యేక పరీక్షల నిర్వహకులు ఆదిలాబాద్ జిల్లా లోని శిక్షణ కానిస్టేబుల్ లకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈరోజు ఉదయం భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య అధినీయం, బిఎస్ఏ లలో పరీక్షను శిక్షణ కానిస్టేబుల్ రాస్తున్నట్లు మిగిలిన వాటిలో తదుపరి మూడు రోజులు పరీక్షలు ఉండబోతున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ సి సమయ్ జాన్ రావు, నిజామాబాద్ సిటిసి ఎసిపి సయ్యద్ మస్తాన్ అలీ, ఆర్ఐ కార్తీక్, ఆర్ఎస్ఐ రాకేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన వైద్యం అందించాలి

### చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి

**తుక్కుగుడ మున్సిపల్, అక్టోబర్ 16(డైలీ రిపోర్ట్):** తుక్కుగూడ మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేసినటువంటి శ్రీ విశిష్ట మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి లిరాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ తో కలిసి హాజరై ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మరియు శ్రీరాములు హాస్పటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ లిచైర్మన్ బరిగెల హేమలత రాజు గౌడ్ స్థానిక కౌన్సిలర్లు కాంటెకర్ మధుమోహన్, రాజమోని రాజు ముదిరాజ్, జపాల భావన సుధాకర్, బాకీ విలాస్, బిజెపి సీనియర్ నాయకులు శ్రీనివాస్ నాయక్, శ్రీధర్ గౌడ్, బీజేవైఎం అధ్యక్షులు బరిగెల రాకేష్ గౌడ్, లవ కుమార్, బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.



Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707